క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ



తెనాలిఅర్బన్: ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూచిపూడి జాన్‌బాబు ఆధ్వర్యంలో తెనాలి మండలం కఠెవరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు, జామెట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.ప్రసాద్, ఎంఈవో–2 జయంతిబాబు, హెచ్ఎం టి.శ్రీధర్, గుమ్మడి వెంకట నారాయణ పాల్గొన్నారు.

క్రీడా వస్తువులు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు జవ్వాజి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా శుక్రవారం నాజర్‌పేటలోని లూథరన్ అపర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సాతులూరి రామ్‌ప్రసాద్, వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, రమేష్, కృష్ణ, కుమార్, పాల్గొన్నారు.

గ్రామాల్లో భద్రతా బలగాల కవాతు



తెనాలిరూరల్: ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ప్రజలకు సూచించారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని కోపల్లె, గుడివాడ, కఠెవరం గ్రామాల్లో రూరల్ పోలీస్ సిబ్బంది అలాగే సీఐఎస్ఎఫ్ బలగాలు కలిసి శుక్రవారం సంయుక్తంగా రూట్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు పోలీస్ రూట్ మార్చ్ చేసినట్లు తెలిపారు.

దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని చుండూరువారి సత్రం ఆవరణలో శుక్రవారం నిరుపేదలకు యోగసానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీ యోగ గురించి వారికి వివరించారు. యోగసనాలు చేయించారు. యోగ సభ్యులు రాజారెడ్డి సహకారంతో నిరుపేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. సహాయగురువు కూరపాటి నాగరాజు, సూర్యనారాయణ, సుబ్బారావు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి జేఎంజే కళాశాల సమీపంలో నివసించే మహిళతో అంగలకుదురుకు చెందిన టైలర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె చేయి పట్టుకుని లాగడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో మహిళా నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి కుట్టు శిక్షణ కేంద్రం ఆర్గనైజర్ గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం విజయవాడ బాధ్యులు కాట్రగడ్డ స్వరూపరాణి పాల్గొని మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్‌తో పాటు రాజకీయ అధికారంలో కూడా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంబీవీకే బాధ్యురాలు పి. విజయ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడి స్వయం ఉపాధి పొందడానికి కుట్టు శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కుట్టు శిక్షణ ఉపాధ్యాయురాలు సీహెచ్. సుజాత, నిర్వాహకులు వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆటోనగర్ అభివృద్ధికి అన్నాబత్తుని కృషి మరవలేనిది

- ఆత్మీయ సమ్మేళనంలో పలువురు నాయకులు
- పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఆటోనగర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: తెనాలి ఆటోనగర్ ఏర్పాటు చేసి దాని అభివృద్ధికి కృషి చేసిన మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణను ప్రజలు గుర్తుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆటోనగర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం అసోసియేషన్ హాల్‌లో జరిగింది. సమావేశానికి అసోసియేషన్ చైర్మన్ శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయడం సులభం కాదని, 40 ఏళ్ల క్రితం అప్పటి తెనాలి ఎమ్మెల్యేగా ఉన్న తమ తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ ఆటో నగర్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తెనాలి పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో శివారు సోమ సుందరపాలెం సమీపంలో 56 ఎకరాల విస్తీర్ణంలో ఆటోనగర్‌ను ఏర్పాటు చేశారన్నారు. లారీ యాజమానులు, మోటార్ సెక్టార్‌కు సంబంధించిన వ్యాపారులకు స్థలం కేటాయించారని తెలిపారు. ముందు చూపుతో ఆటో నగర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం వేలాది మంది ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. అసోసియేషన్ సభ్యులు సహకారం కూడా అభివృద్ధిలో పాత్ర ఉందన్నారు. ఆటోనగర్‌లో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ దమ్ముగా రాజకీయం చేసే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే శివకుమార్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పనిచేస్తున్నారని, ఆయనకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేయాలని, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడుతూ ఆటో నగర్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని సోమసుందరపాలెం, కంచర్లపాలెంలో పొలాలకు విపరీతంగా ధరలు పెరిగాయని, ఆటోనగర్‌లోని వ్యాపారులు, కార్మికులు సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. కఠెవరం మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహనశ్యామ్‌ప్రసాద్, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, వసంతరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇస్మాయేల్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, షాపుల యాజమానులు, షాపుల్లో పనిచేసే కార్మికులు పాల్గొన్నారు.

శ్రీఅరవింద విద్యా కేంద్రం 43వ వార్షికోత్సవం



మున్సిపల్ చైర్‌పర్సన్ రాధికకు సత్కారం

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యా కేంద్రం 43వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అక్కడి ధ్యానమందిరంలో సామూహిక ధ్యానంతో కార్యక్రమాలను ఆరంభించారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ అనంతరం తెనాలి శ్రీ అరవింద సొసైటీ విమెన్స్ కౌన్సిల్ కార్యదర్శి యడ్ల లక్ష్మి శ్రీమాత పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు పలు భౌతిక విన్యాసాలతో శ్రీమాతకు అభివందనం చేశారు. విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్‌ను సత్కరించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్పకు జ్ఞాపికను బహూకరించారు. విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామరాజు, అరవింద సొసైటీ చైర్‌పర్సన్ వై.పద్మశ్రీ, కార్యవర్గ సభ్యులు వి.నాగమల్లేశ్వరి మాట్లాడారు. విద్యా కేంద్రం శ్రీమాతారవిందుల ఆశయాల కనుగుణంగా నడుస్తుండటాన్ని వారు కొనియాడారు. విద్యార్థులకు దాతలు అందించిన విరాళాలతో ఉపకార వేతనాలను అందజేశారు. విద్యాకేంద్రం ప్రధానోపాధ్యాయిన ఆర్.నిర్మలాకుమారి వందన సమర్పణ చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులతో కూడా పరీక్ష కిట్లను సత్తెనపల్లికి చెందిన గన్నమనేని కన్‌స్ట్రక్షన్స్ శుక్రవారం అందజేసింది. ఈ సందర్భంగా కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి జరగనున్న పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా రాసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు జంపల రమేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేను కార్మికులంతా వినియోగించుకోవాలి

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ డేను సచివాలయాల సిబ్బంది, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులంతా వినియోగించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ సూచించారు. తాడేపల్లి కార్పొరేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు ఉద్యోగస్తులు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాలను ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డేగా నిర్ణయించారని తెలిపారు. ఇందులో వచ్చిన కార్మికుల సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఆర్వో మురళి, సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆటో

పది మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న నాగరాజు, ఇతర క్షతగాత్రులు

తెనాలిరూరల్: తెనాలి మండలం ఆటోనగర్ వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురు తీవ్రంగా గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో చిన్నారులు, మహిళలు ఉన్నారు. ప్రమాదానికి సంబంధించి బాధితుల వివరాల మేరకు.. కొల్లిపర మండలం మున్నంగి గ్రామానికి చెందిన కొందరు కఠెవరంలో బంధువులు చనిపోవడంతో శుక్రవారం ఆటోలో వచ్చారు. సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో పది మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఆటో నగర్ వద్దకు రాగానే వీరి ఆటో ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్నవారు గాయపడ్డారు. వారిని రెండు 108 అంబులెన్సులలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ వేమూరి నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని అత్యవసర చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వేమూరి మల్లేశ్వరి, గురిందపల్లి అభినయ, నవతేజ్‌కు తీవ్రగాయాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సావిత్రి నటన అజరామరం

- చిర్రావూరులో విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



మహానటి సావిత్రి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్ : మరణించి జీవించి ఉన్న మహానటి సావిత్రి అని, విగ్రహాన్ని ఆమె జన్మించిన గ్రామమైన చిర్రావూరులో ప్రారంభించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని మాజీ మంత్రి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. విగ్రహ దాత, ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, సావిత్రి బంధువు దావులూరి పార్వతితో కలసి శుక్రవారం రాత్రి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సావిత్రి నటన అజరామరమని కొనియాడారు. కార్యక్రమంలో చిర్రావూరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేకల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఈదుల మూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి పాలేటి కృష్ణవేణి, కుంచనపల్లి పార్టీ అధ్యక్షుడు మిరియాల రాంబాబు, కొలనుకొండ పార్టీ అధ్యక్షుడు నూతక్కి శ్రీను, తాడేపల్లి రూరల్ వైఎస్సార్ సీపీ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, సావిత్రి అభిమానులు, చిర్రావూరు ప్రజలు పాల్గొన్నారు.

ఉండవల్లిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ఉండవల్లి జామాయిల్ తోటలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్థానికులతో కలసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జామాయిల్ తోటలో కరోనా తరువాత మూడు సంవత్సరాలలో కోటి రూపాయలతో గ్రావెల్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాయి నగర్, బాపనయ్యనగర్ ప్రాంతాల్లో పంచాయతీగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు శిథిలావస్థకు చేరాయని, అక్కడ రహదారులు నిర్మించేందుకు అన్ని అనుమతులు తీసుకున్నామని, త్వరలోనే నిర్మిస్తామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఇక్కడ ఎమ్మెల్యేగా లావణ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అమరా నాగయ్య, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మంగళగిరి శివాలయం బోర్డు మెంబర్ కొల్లి మునలారెడ్డి, ఉండవల్లి జేసీఎస్ కన్వీనర్ అనిల్, కళ్లం సాంబిరెడ్డి, కళ్లం పిచ్చిరెడ్డి, పెనుమాక సొసైటీ అధ్యక్షుడు మేకా శివారెడ్డి, పెనుమాక పార్టీ అధ్యక్షుడు దామేశ్వరరెడ్డి, ఏఈ కిశోర్, సెక్రటరీ రాధాకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాలచెరువులో రోడ్డు ప్రారంభం

మంగళగిరి: పట్టణ పరిధిలోని రత్నాలచెరువులో రూ 1.50 కోట్లతో నిర్మించిన రోడ్లను శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండి. ఫిరోజ్, మహిళా నేత మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు.

మహిళాభ్యుదయంతోనే దేశ ప్రగతి

గుంటూరు రూరల్: మహిళా శక్తిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, అన్ని రంగాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కలిగించినప్పుడే దేశ ఆర్థిక ప్రగతి వృద్ధి చెందుతుందని ప్రముఖ న్యాయవాది, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డొమెస్టిక్ వొయిలెన్స్ సెల్ కౌన్సిలర్ కేవీ పద్మావతి పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, డాక్టర్ జి సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.28.73 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గంలోని 18 మందికి మంజూరైన రూ.28.73 లక్షల ఆర్థిక సాయం నగదు చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలోని లేని వ్యాధుల చికిత్సకు అవసరమైన వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎమ్మెల్యే శివకుమార్ సిఫార్సుపై 18 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సాయం లభించింది. స్థానిక గంగానమ్మపేటలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే శివకుమార్ ఆయా కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. దీనితో ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలోని 217 మందికి రూ.1.68 కోట్ల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తాడిబోయిన బుచ్చిరాజు, చుండూరు సాయి, కాళిదాసు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ పావనీ ప్రియాంక, భానుమతి ప్రభృతులు

తెనాలి: స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ, హ్యాపీ హాస్పటల్ సంయుక్తంగా గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. హ్యాపీ హాస్పటల్‌లో ఏర్పాటైన ఈ కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి నివారణ, నిర్ధారణ, చికిత్స ఆవశ్యతను తెలియజేశారు. ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వివాహితల్లో గర్భాశయ క్యాన్సర్ కేసులు వెలుగుచూస్తున్నందున ప్రతి మహిళ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ పావనీ ప్రియాంక సూచించారు. నూతనంగా ఆరంభించిన కేంద్రంలో ప్రతి శుక్రవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి, రూ.3 వేల విలువైన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, డాక్టర్ హరిణి, జయశ్రీ, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి, పుష్ప మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం అన్నాబత్తుని పుష్ప 27వ వార్డులో, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక 37వ వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. రావి ప్రశాంతి, రావి శ్రీనివాసరావు, యాతాటి అనిల్, కఠారి హరిష్, మల్లిబోయిన రాము, తాడిబోయిన రమేష్, మన్నవ ప్రభాకర్, సిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచి జరిగి ఉంటేనే ఓటెయ్యండి

తూములూరు(కొల్లిపర): వైఎస్సార్ సీపీ పాలనలో మంచి జరిగి ఉంటేనే మరోసారి ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అఖిల్ గణేష్ కోరారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తూములూరు గ్రామ శివారు చింతలపాలెంలో అఖిల్ గణేష్ స్థానిక పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా అఖిల్ గణేష్ మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదవారికి పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్, సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెంది పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు యాచకుడై ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

సచివాలయంలో అన్నదాత ఆందోళన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని గ్రామ సచివాలయంలో ఓ రైతు చేసిన హడావుడితో అధికారులు ఖంగు తిన్నారు. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన డి.ఆశీర్వాదం అనే రైతుకు 64 సెంట్లు భూమి ఉంది. ఇటీవల జరిగిన భూముల రీ సర్వేలో భాగంగా స్థానిక సర్వేయర్లు అతని భూమిని కొలిచారు. ఆ సమయంలో భూమి అంతా బాగానే ఉందని, ఎలాంటి ఇబ్బందులూ లేవని చెప్పారు. అయితే సదరు రైతు బ్యాంకులో ఉన్న తన రుణాన్ని రెన్యువల్ చేసుకునేందుకు వెళ్లాడు. సిబ్బంది తాజా అడంగల్, 1బిలు తీసుకురమ్మని చెప్పారు. దీంతో అతను అడంగల్ తీయించాడు. అందులో తనకున్న 64 సెంట్లుకు బదులు 25 సెంట్లు చూపించడంతో రైతు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. పొలం కొలిచినప్పుడు తగ్గని నా భూమి, ఇప్పుడు ఎలా తగ్గిందని అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నించారు. ఆ సమయంలో సర్వేయర్లు లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ రైతు తన టవల్‌ను సచివాలయ బయట ఉన్న గ్రిల్స్‌కు చుట్టి, తనకు న్యాయం చేయకపోతే ఇక్కడే ఈ టవల్‌ను మెడకు చుట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. ఊహించని పరిణామంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ సచివాలయ ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని రైతుతో మాట్లాడారు. ఇంతలో వీఆర్వోలు, స్థానిక నాయకులు రైతుకు నచ్చజెప్పారు. సర్వేయర్లు వచ్చిన తరువాత విషయం తెలుసుకొని న్యాయం చేస్తామని చెప్పడంతో ఆ రైతు శాంతించి వెళ్లిపోయాడు.

కేఎల్‌యూలో మహిళా దినోత్సవం సందడి



వేడుకలను ప్రారంభిస్తున్న వీసీ పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ సుబ్బారావు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మహిళామణులతో కలసి వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విజయవాడ కమర్షియల్ సేల్ టాక్స్ అధికారిణి లలిత కుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తు చేసేదిగా తెలిపారు. ఫెమ్ ఫ్లేర్ చైర్ పర్సన్ డాక్టర్ రూతు రమ్య మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలని పేర్కొన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ నేటి మహిళలు విజ్ఞానానికి నాంది అన్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా మహిళలు పలు రకాల ప్రాతలు ఏక కాలంలో పోషిస్తూ అటు కుటుంబాన్ని, ఇటు విద్య, వ్యాపార, సామాజిక రంగాల్లో దూసుకుపోవడం అభినందనీయమని తెలిపారు. ఉత్సవంలో మొదటిరోజు టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్యక్రమాల్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం కార్యదర్శి కోనేరు శివకాంచన లత, ప్రో వీసీలు డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్లు డాక్టర్ పి. లక్ష్మీప్రసన్న, డాక్టర్ ఎ. ప్రియ, డాక్టర్ కె. సోని, డాక్టర్ మెహమూదా షేక్, పి. లలిత సూర్యకుమారి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పెదకాకాని: పేకాట ఆడుతున్న 8 మందిపై కేసు నమోదైంది. మండల పరిధిలోని తంగెళ్లమూడి గ్రామ శివార్లలోని సపోటా తోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 8 మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,570 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, తెనాలి మండలం, టౌన్ నందులపేట డోర్ నెం.2-33-15 జెండాచెట్టు నివాసులు కూచిపూడి రాజు గారి కుమార్తెలు 1.రోహిణి, 2. దీప్తుల తరుపున సంజాయిషీ పొంది ఈ దిగువ తెలిపిన విధంగా ప్రకటన చేయవలసినదిగా కోరడమైనది. నా క్లయింటు చినరావూరు నుండి తెనాలి నందులపేటలో గల 6వ వార్డు సచివాలయంనకు వచ్చుచుండగా మార్గ మధ్యలో తెనాలి సర్వే నెం.194/2బి లో 296.50 చ.గ.లు ఇంటి స్థలానికి చెందిన విక్రయ దస్తావేజు తెనాలి సబ్ రిజిస్ట్రార్ మెయిన్ ఆఫీసులో రిజిస్టరు కాబడిన డాక్యుమెంట్ నెం.2719/2007గా నమోదు కాబడిన డాక్యుమెంట్ జిరాక్స్ తీసుకొను నిమిత్తం స్కూటర్‌పై వస్తుండగా మార్గమధ్యలో పోయినది. దొరికిన వారు దిగువ అడ్రసుకు తెలియజేయగలరు.

కూచిపూడి రేష్మ, సెల్: 7981254850

గాదెలపర్తి ప్రభాకరరావు, న్యాయవాది, తెనాలి. సెల్: 9440089009